


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 6 పుష్యం : 16-18 05-12-2001

RAMANA BHASKARA
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 20

**VOL : 7** **ISSUE : 6**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## కర్తృత్వము

ఈశ్వరుని స్వరూపము తెలియకపోవటమే అజ్ఞానము. అజ్ఞానమువలన కర్తృత్వబుద్ధి కల్గుతుంది. తాను కర్తనిఅని అనుకోవటవే కర్తృత్వము. కర్తృత్వమువలన గందరగోళమువస్తుంది. తత్వానికి సంబంధించిన నిశ్చయము ఉండదు. అశాంతి ప్రారంభం అవుతుంది. మరణభయము వెంటాడుతుంది. దేహమునకు పరిమితమైనబుద్ధి నశించేవరకు అభయస్థితికలుగదు. అభయస్థితికి మరొకపేరే మోక్షము. కర్తృత్వబుద్ధిలేనివాడినే కారణజన్ముడుఅని అంటారు. కర్తృత్వమే జన్మలకి కారణం. రాగద్వేషములమధ్య ఊగిసలాడుతూ ఉంటాడు. రాగమువలన ఇష్టమువస్తుంది. ద్వేషమువలన అయిష్టం వస్తుంది. జీవితముయొక్క విలువ గుర్తించలేడు. అందరి హృదయములలోను ఈశ్వరుడు ఉన్నాడు. ఆయనే లోకంగా కన్పిస్తున్నాడు. కర్తృత్వము అహంభావన రూపములోఉంటుంది. అహంభావి గురువుకాలేడు. జీవకోటికి అసత్యమునుండి సత్యమునకు దారిచూపించలేడు. ఎట్టి పరిస్థితులలోను అహంభావమునకు ప్రాముఖ్యత ఇవ్వకూడదు. అశాంతికి అదేకారణం. అన్నివిధముల ప్రయత్నముచేసి దానిని నశింపచేయుట మాత్రమే సాధన గమ్యం.

ఈశ్వరుడుపట్ల భక్తిభావనపెంచుకోవాలి. అందువలన అహంభావన సహజంగానే నశిస్తుంది. మానవుడు తాను కర్తనుఅని అనుకోవటంవలన సుఖ దుఃఖములకు వశమవుతున్నాడు. కర్తృత్వముఉన్నవాడికి భోక్తృత్వముకూడా ఉంటుంది. రూపబుద్ధి, నామబుద్ధి కర్తృత్వమును పెంచుతాయి. దేహాత్మభావన తొలగించుకోలేనివాడికి రూపనామములకు ఆధారముగా సద్వస్తువు తెలియబడదు. సూర్యుడు లోకాన్ని వెలుగుతో నింపుతున్నాడు. కర్తృత్వబుద్ధినుండి విడుదల పొందినవాడు లోకాన్ని శాంతితో నింపుతాడు. కర్తృత్వము నశించేకొలది బుద్ధికి వికాసము కల్గుతుంది. బుద్ధిమంతుడు తాను జీవితగమ్యాన్ని చేరుకోవటమే కాకుండా ఇతరులుకూడా చేరుకొనుటకు సహాయసహకారములు అందిస్తాడు. జ్ఞానములేని జీవితము అర్థరహితము. జ్ఞానిమాత్రమే ఈశ్వరుని స్వరూపమును పొందుతాడు.

- సద్గురు శ్రీ నాన్నగారు.

**ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

28-10-2001 కైకలూరు ............ 3
19-11-2001 జువ్వలపాలెం ............ 8
18-11-2001 రాయలం, భీమవరం ............ 14

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 28-10-01, కైకలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు జ్ఞానస్వరూపుడు. ఈశ్వరుని తెలుసుకోవటంఅంటే జ్ఞానాన్నిపొందటమే. భగవంతుడు అంతటా వ్యాపించిఉన్నాడు. అందరి హృదయాలలో అంతర్యామిగాఉన్నాడు, చేతనంలోఉన్నాడు, అచేతనంలోఉన్నాడు. స్థంబంలో దేవుడుఉన్నాడా అని ప్రహ్లాదుడిని హిరణ్యకశపుడు అడిగినప్పడు ఉన్నాడు అనిచెపుతాడు. ప్రహ్లాదుడి మాట నిజంచేయటంకోసం లక్ష్మీ నరసింహస్వామి స్థంబాన్ని చీల్చుకొనివచ్చాడు. ఆత్మస్థితిఅంటే అది మన సహజస్థితి. మనం సహజస్థితికి దూరంగా ఉండటంవలన అది మనకు తెలియటంలేదు. మన మాటలో, చేతలో, దైనందిన జీవితంలో మనం సహజంగాలేము. అందువలన మనకు సహజస్థితి అందటంలేదు. అందువలన మనం ఏమిచేసినా సహజంగా చేయాలి. ధనంఉండటం, ధనంలేకపోవటం, అధికారంఉండటం, అధికారంలేకపోవటం ఇవిఅన్నీ దేహానికి సంబంధించిన విషయములు. ఇవిఅన్నీ స్వప్నసమానము. మనం పొందవలసిన వస్తువు మన హృదయంలో సహజంగాఉంది. దానిని తెలుసుకొంటే మృత్యువును జయిస్తాము. మృత్యువును జయించటంఅంటే దేహం మరణిస్తుంది. దేహం మరణించినా మనకు మరణంలేదు, మనం ఉంటాముఅని సహజంగా మనకు తెలుస్తుంది. మన బుద్ధిలో దోషాలు పెరగటానికి మనలోఉన్న తమోగుణం, రజోగుణం కారణం. ఏదో కొద్దిసేపు జపంచేసాము, ధ్యానంచేసాము అనిఅంటూ మిగిలిన కాలంఅంతా రజోగుణంలోఉంటే ఈ జపధ్యానముల వలన ఏమీ కలిసిరాదు. జపధ్యానములవలన ఏదైనా కొంతశక్తిని సంపాదించినా రజోగుణంతో జీవిస్తే ఆశక్తి అంతా బయటకు పోతుంది.

మీరు చేసేపని శ్రద్ధగా చేసుకోండి. పని విడిచిపెట్టవద్దు అని మీటింగులలో చెపుతూఉంటే కోపాలు వస్తున్నాయి. మీకు కోపాలు రావటంవలన నాకు ఏమీ నష్టంలేదు, మీరు సంతోషించటంవలన నాకు ఏమీ లాభంలేదు. ఇక్కడకు కొంతమంది వచ్చి శ్రవణం చేస్తున్నారు. మీరు రాకపోయినా నాకు నష్టంలేదు, పదివేలమంది వచ్చినా నాకు లాభంలేదు. నాన్నగారు నాన్నగారులాగే ఉంటారు. అంటే నాఉద్దేశం ఏమిటిఅంటే మీకు నామీద కోపం వచ్చినా పరవాలేదు కాని మీరు పనిని విడిచిపెట్టకూడదు. పని విడిచిపెట్టటమే భక్తి అనుకొంటే వాడికి జ్ఞానంరాదు, సోమరితనం వస్తుంది. మీకు నామీద విరోధంవచ్చినా నాకు ఏమి ఇబ్బందిలేదు కాని మీరు బాగుపడాలి అది ముఖ్యం. సబ్జక్టు చెప్పేటప్పడు జ్ఞానంగురించి చెపుతాముగాని అది మీకు నచ్చలేదు అని మీ జీవలక్షణాలకు అనుకూలంగా చెప్పే సమస్యలేదు. ధనం సంపాదించాలి అనుకొనేవారు, విద్య నేర్చుకోవాలనుకొనేవారు కష్టపడి వాటిని ఎలా సంపాదించుకొంటారో అలాగే ఆధ్యాత్మిక రంగంలో ఉన్నవారు కష్టపడి సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. చేతిలో పైసాలేకుండా బజారులోఉన్న వస్తువులు కొనుక్కోవాలనుకొనేవాడు ఎటువంటివాడో సత్వగుణం లేకుండా జ్ఞానం సంపాదించాలి అనుకొనేవాడు అటువంటివాడే. అందుచేత సత్వగుణం సంపాదించాలి. ఎవరితో సహవాసంచేస్తే సత్వగుణం వస్తుందో వారితో సహవాసంచేయాలి. రజోగుణం ఉన్నవారితోను, తమోగుణం ఉన్నవారితోను తప్పించుకొని తిరిగేవాడు ధన్యుడు. అలాగని వారితో పేచీలు పెట్టుకోకూడదు. మనం సత్వగుణంలో ఉన్నాముఅని అనుకొంటాము. ఎవరైనా తమోగుణంగా, రజోగుణంగా మాట్లాడితే ఈ సత్వగుణం అంతా పోతుంది. మనకు సత్వగుణం సంపాదించాలి అనేబుద్ధిఉందిగాని దానిని పోషించుకోలేకపోతున్నాము, అభ్యాసం చేయలేకపోతున్నాము. సత్వగుణం ఇంకా మనకు సహజంఅవ్వలేదు. మామూలుగా సత్వగుణంఉంటే మంచిదే. అంతమాత్రంచేత ఈశ్వరానుగ్రహం మనకురాదు. రజోగుణం ఉన్నవారి మధ్యకూడ మనం సత్వగుణాన్ని కాపాడుకోవాలి. అప్పడు మనం భగవంతుని దయకు పాత్రులవుతాము, మాయను దారిఇమ్మని చెపుతాడు. మాయ ఈశ్వరుని చేతిలోఉంది. ఆయన దారిఇవ్వమంటేగాని మాయ దారిఇవ్వదు. కొంతమంది ఇళ్ళదగ్గర కుక్కలు ఉంటాయి. మనం వెళితే మొరుగుతాయి, గొడవచేస్తాయి. యజమానివచ్చి చెపితే తప్పకొంటాయి, మనం చెపితే తప్పకోవు. అలాగే మాయ ఈశ్వరునిచేతిలోఉంది. ఆయన దారిఇవ్వమంటే మాయదరిఇస్తుందిగాని మనం చెపితే అదివినదు. మనం సత్వగుణంలో నిలబడగలగాలి. సత్వగుణం ఎంతవరకు అభివృద్ధి పొందాలంటే మన దేహప్రారబ్దాన్నిబట్టి రజోగుణం ఉన్నవారు మనకు స్నేహితులుగా దొరికారుఅనుకోండి, వారిమధ్యనకూడా మనం సత్వగుణంలో ఉండాలి. ఈశ్వరుని ఆరాధించటంవలన తమోగుణంలోనుండి, రజోగుణంలోనుండి మనలను విడుదలచేస్తాడు.

మనస్సును దొంగతనం చేసేవాడు గోవిందుడు. గుణాలుఅన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సును దొంగతనంచేస్తే, మనస్సుపోతే దానిలోఉన్న గుణాలు అన్నీపోతాయి. ఇప్పడు మీరు దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నారో, అలా ఆత్మతోటి ఎవడైతే తాదాప్యం పొందాడో వాడిలోనుండి ఆధ్యాత్మిక శక్తి ప్రవహిస్తుంది. ఆ శక్తి ప్రవహిస్తూఉంటే మా మనస్సును

నిగ్రహించుకోవాలి అని మీరు అనుకోనక్కరలేదు మీరు చేసే జపంతోటి, ధ్యానంతోటి సంబంధంలేకుండా మీ మనస్సు నిగ్రహింపబడుతుంది, మీరు ప్రత్యేకంగా ప్రయత్నం చేయనక్కరలేదు. సత్పురుషుల, జ్ఞానుల జ్ఞపకంచాలు, స్మరణచాలు. పూజ, జపం, ధ్యానంవలన ఏ ప్రయోజనం వస్తుందో వారి స్మరణవలన అంతావచ్చేస్తుంది. శరీరాలు దగ్గరగా ఉండనక్కరలేదు. వారి జ్ఞాపకం చాలు. మీ శరీరం అమెరికాలోఉన్నా భగవంతుడిని స్మరిస్తే నిప్పుమీద నీరు జల్లినట్లు మీ మనస్సులోఉన్న మాటఅంతా, గందరగోళంఅంతా చల్లారిపోతుంది. వారి వైభవం అట్టిది. స్మరణవలననే రజోగుణం సహజంగా అణిగిపోతుంది. రజోగుణం, తమోగుణంఉంటే హింసాప్రవృత్తి వచ్చేస్తుంది. మీరు సత్వగుణాన్ని ప్రాక్టీసుచేస్తున్నారుఅనుకోండి మీలో ఎంతబలంఉందో భగవంతుడు పరీక్ష చేస్తాడు. మీ ఇంట్లోవారిచేత తిట్టిస్తాడు. మీకు సత్వగుణం నిలకడగా లేకపోతే మీరు తిరిగి తిట్టేస్తారు, మీకు సత్వగుణం ఆక్షణంలోపోతుంది, రజోగుణం వచ్చేస్తుంది. మాటకు మాటఅనేస్తారు. మనకు ట్రైనింగ్ ఇవ్వటంకోసమే భగవంతుడు ఇవిఅన్నీచేస్తాడు.

జీవితంపట్ల సరియైన దృక్పదంఉండాలి. నా జీవితంపట్ల నాకే సరియైన దృక్పదం లేనప్పుడు హృదయంలోఉన్న వస్తువు నాకు తెలియబడదు. మన హృదయంలో ఒకనిజం ఉంది. మనం దాని దగ్గరకు వెళతాము, మరల వచ్చేస్తూఉంటాము. ప్రకృతి వాసనలు అక్కడ నిలబడనీయవు. లోపలున్న నిజంలో స్థిరపడేవరకూ జ్ఞాని మిమ్మల్ని వెంటాడుతాడు. అందరూ మనలను మంచివారు అనుకోవాలి, అందరూ మనలను గౌరవించాలి అనుకోవటం ఒక పిచ్చితనం. కొంతమంది ఉంటారు వారికి 99 ఉపకారాలుచేసినా ఏదోఒకటి చేయకపోతే వారికి మనకు విరోధం, ఈ 99 ఉపకారాలు మర్చిపోతారు, మనలను విరోధుల లిస్టులో చేర్చేస్తారు. ఇటువంటి మనషులతో మనం గౌరవాలు ఎంతకాలం పొందుతాము. ఇంట్లో ఏకాంతంగా కూర్చొని అరుణగిరిని స్మరణ చేసుకొంటున్నారుఅనుకోండి. స్మరణకూడా సత్సంగం. ఎందుచేతనంటే దానివలన నీకు మానసిక అనుబంధం వస్తుంది. మానసిక అనుబంధంవలన నీ మనస్సు పవిత్రంఅవుతుంది. సత్సంగంవలన ప్రాపంచిక విషయములతో సంబంధం తెగిపోతుంది. మనం భగవంతుని స్మరణచేస్తాము, భావనచేస్తాము. అందులోకూడా ద్వైతంఉంది. భగవంతుని స్మరించగా, స్మరించగా విషయచింతనపోతుంది, తరువాత నెమ్మదిగా భగవంతుని చింతనకూడా పోతుంది. భగవంతునికంటే నేను వేరుగాఉన్నానుఅనే వేరుబుద్ధిపోతుంది. అది సద్భావస్థితి. ఆ స్థితిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఆ స్థితిని నోటితో చెప్పలేము. అది అనుభవైక వేద్యం. డబ్బు సంపాదించటం తేలిక, విద్యను సంపాదించటం తేలిక కాని మంచితనం సంపాదించటం చాలాకష్టం. మంచితనంవలన మీకు జ్ఞానంకలుగుతుంది. మీరు సాధనచెయ్యండి. నేను చెప్పినట్లు చేయనక్కరలేదు. మీకు ఇష్టమైన పద్ధతిలో సాధనచెయ్యండి. కాని అహంకారం సర్వనాశనం అయ్యేవరకు సాధనవిడిచిపెట్టవద్దు.

విమర్శ ప్రధానంగా పెట్టుకొన్నవారు చిన్న మంచిపనికూడా చేయరు. కొంతమందికి విమర్శ అలవాటు ఉండదు. చేస్తేమంచిపనిచేస్తారు లేకపోతే నిర్మలంగా ఉంటారు. వారు చిన్నపనికూడా పెద్దమనస్సుతోచేస్తారు, ప్రేమతోచేస్తారు. అలాచేస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. దేనిపట్ల ఆసక్తిపెట్టుకోవద్దు. అలాగని ప్రేమనివిడిచిపెట్టవద్దు. ఆసక్తివేరు, ప్రేమవేరు. ఆసక్తి మనలను బంధిస్తుందికాని ప్రేమబంధించదు. ఈ శరీరంఉండగానే మనం ముక్తిస్థితినిపొందాలి. నీవు ఆ స్థితిని పొందలేకపోతే, ఆ స్థితిపొందినవారు ఎక్కడైనా ఉన్నారేమో వెతికి, వెతికి వారి సాంగత్యంచెయ్యి. వారితో శారీరకంగా దగ్గర ఉండనక్కరలేదు, మానసిక అనుబంధం సరిపోతుంది. చెడుతలంపులు రాకుండా చూసుకోవాలి. అందరూ బాగుపడాలి, అభివృద్ధిలోనికిరావాలి అనుకోవాలి. మానసిక దారిద్ర్యం ఉండకూడదు. మానసిక దారిద్ర్యం ఉన్నవారికి మోక్షంరాదు. ఆత్మానుభవం పొందినవారిలో ప్రశాంతత తాండవిస్తూఉంటుంది, వారు శక్తివంతులుగాఉంటారు, వారు ఆనందంలో ఊగిసలాడుతూఉంటారు. వారిలోనుండి శాంతి, కాంతి ప్రసరిస్తూఉంటుంది. గూటిలోనుండి విడుదలచేసిన పక్షికి ఎంత స్వేచ్ఛవస్తుందో, అజ్ఞానంనుండి బయటపడినప్పుడు మనకుకూడ అంత స్వేచ్ఛవస్తుంది. వాడు నిజమైన సుఖి.

మీకు ఏ కారణంవలనఅయినా గర్వంవస్తోంది అనుకోండి, దాని వెనకాలే గర్వభంగం వచ్చేస్తుంది. అనుకరణవద్దు. అనుకరణచేస్తూఉంటే అది మన బలహీనతకు గుర్తు. మన సంసారమునకు తగినట్లుగా మనం వ్యవహరించాలి, గొప్పలకు వెళ్లవద్దు, అనుకరణవద్దు. ఇలాఉంటే అది మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. నీవు పొందవలసింది ఈ జన్మలోనేపొందు. సత్పురుషులను ఆశ్రయించటంవలన, వారి దయకు పాత్రులవ్వటంవలన నీ హృదయంలోఉన్న వస్తువు ఒక్కసారి తళుక్కున స్ఫురిస్తుంది. పెళ్ళికిముందు రెండు నెలలనుండి చాలా హడావిడి ఉంటుంది కాని ఆ ముహూర్తం కొన్నిక్షణాలలో జరిగిపోతుంది అలాగే నీహృదయంలోఉన్న వస్తువు ఒక్కసారి తళుక్కున స్ఫురిస్తుంది. పెళ్ళికిముందు రెండునెలల నుండి చాలా హడావిడి ఉంటుందికాని ఆ ముహూర్తం కొన్నిక్షణాలలో జరిగిపోతుంది అలాగే నీ హృదయంలో ఉన్న వస్తువు స్ఫురించటం కొన్ని క్షణాలలో జరిగిపోతుంది. ఎన్ని ఉపన్యాసాలువిన్నా, ఎన్ని రచనలు మీరుచేసినా, ఎన్ని శాస్త్రాలు అధ్యయనంచేసినా, లోకంలో మీరు ఎన్ని ఘనకార్యాలు చేసినా

అది మీకు లభించదు. సత్పురుషుల సహవాసంవలన, వారి అనుగ్రహంవలన నీలోపలున్న వస్తువునీకు స్ఫురిస్తుంది. నీ పూర్వపుణ్యంవలన సత్పురుషుల సహవాసం నీకుదొరికిందిఅనుకో నీకు నియమాలతోను, వ్రతాలతోను పనిలేదు. నియమాలుఅన్నీ మనోచాపల్యం తగ్గించటానికే. సత్పురుషుల సహవాసంవలన మనస్సు, ఇంద్రియాలు వాటిఅంతటఅవే నిగ్రహించబడతాయి ఇంక నియమాలతో నీకుపనిలేదు. మీరు ఒక పనిని నిష్టగా చేస్తున్నారుఅనుకోండి అదే వ్రతం. కల్పవృక్షంఅంటే మీఇంట్లో దారిద్ర్యాన్ని పోగొట్టేదికాదు, కామక్రోధాలనుపోగొట్టేది నిజమైన కల్పవృక్షం. విగ్రహాలను ఆరాధించటంవలన తీర్థాలువలన ప్రయోజనంలేదు అనిచెప్పను అవి వందజన్మలలో తీసుకొనివచ్చే మార్పును సత్పురుషులు ఒక్కజన్మలో తీసుకొనివస్తారు. రజోగుణంనుండి, తమోగుణంనుండి కనుక విడదలపొందలేకపోతే ఈ జన్మలోనేకాదు, రాబోయే జన్మలలోకూడా ఎన్నోదోషాలు అలావస్తూనేఉంటాయి. అందుచేత సర్వవిధముల ప్రయత్నంచేసి రజోగుణంనుండి, తమోగుణంనుండి విడుదలపొందండి.

**ఓం నమో భగవతే శ్రీరమణాయ**

**రమణభాస్కర**

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 19-11-01, జువ్వలపాలెం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనుషులు అందరూ ముముక్షువులుకాదు. మోక్షాన్ని సంపాదించాలనే కాంక్షఉన్నవారిని ముముక్షువులు అంటారు. పూర్వపుణ్యంఉంటేగాని ముముక్షత్వంరాదు. ఆత్మజ్ఞానానికి మరోపేరు మోక్షం. మోక్షంఅంటే విడుదల, దేనినుండి విడుదలఅంటే దేహబుద్ధినుండి విడుదల. మనహృదయంలో బ్రహ్మంఉంది. అది పరమపవిత్రమైనది. అది ఎంత పవిత్రమైనదో మనంకూడా అంతపవిత్రమైతేగాని అందులో ఐక్యంకాలేము. ఎక్కడో బ్రహ్మం వరకు అక్కరలేదు. మనలో చైతన్యస్థాయిలో తేడాఉంటే ఒకరు చెప్పినమాట ఇంకొకరు అర్థంచేసుకోలేరు. ఎందుచేతనంటే అవగాహనలోపం వస్తుంది. భగవంతుడు చెప్పినమాట మనకు అర్థంఅవ్వాలిఅంటే భగవంతుడంతటివారము అయితేగాని ఆయన చెప్పినమాట మనకు అర్థంకాదు. సత్పురుషుల సహవాసంవలన అన్నీవస్తాయి, మోక్షంకూడా వస్తుంది. దేహమునేనుఅనే తలంపునుండి విడుదలపొందటానికి విచారణ అవసరం. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా దేహగతమైన నేనులోనుండి విడుదలపొందాలి, అదే నీజీవితగమ్యం. దేహాభిమానంలోనుండి విడుదలపొందితే అంతటా నీవేఉన్నావని నీకు తెలుస్తుంది. ఆస్థితిపొందటానికి మనలోఉన్న వాసనలు, భోగకాంక్ష అడ్డువస్తున్నాయి. మనం ఎంతసేపు





ఈ జీవితాన్ని ఎంజాయ్‌చేయాలని అనుకోవటంవలన మనకు లోచూపు కలగటంలేదు, మనస్సు అణగటంలేదు మనస్సు అణిగితేగాని ఆత్మజ్ఞానంకలుగదు. సాధనచేసేటప్పుడు ఏకాంతంగానేచేయండి, ఏదైనా అధ్యయనంచేసేటప్పుడు నలుగురు కూర్చొని చదువుకోవచ్చుఅని పెద్దలు చెపుతారు నేను అదిచేసాను, నేను ఇదిచేసానుఅని చాలామంది అంటూఉంటారు. ఈశ్వరుడు మనచేత ఏమిచేయిస్తే అది మనంచేయగలంగాని మనవలన ఏమీఅవ్వదు. మనవలన ఏదోఅవుతుంది అనుకొంటున్నాము అందులోనుండి విడుదలపొందాలి. మనం భగవంతుడికి వేరుగాలేము. వేరుగాఉన్నాముఅనుకొంటున్నాము. ఆ వేరుబుద్ధి నశిస్తే ఇక్కడే మనకు భగవదనుభవం కలుగుతుంది, ఆనందం శాంతివచ్చి మనలను వరిస్తుంది. శరీరం చనిపోయేలోపు ఒక్క అంగుళం లోపలకు దిగటానికి ప్రయత్నించండి. లోపలకు దిగితే లోపలఉన్నవస్తువుయొక్క వైభవం నీకు తెలుస్తుంది.

మనస్సు అణిగినప్పుడు ఏకాంతవాసంవస్తుంది. విషయచింతన, దేహవాసన, లోకవాసన లేనప్పుడు నీవు లక్షమంది మధ్యకూర్చొన్నా ఒంటిరిగా ఉన్నట్లు నీకు అనిపిస్తుంది. మనకు లోపల, బయట అనుకొనే పాడుబుద్ధిపోలేదు. ఇది ఉన్నంతకాలం నీకు ఏకాంతవాసంరాదు. లోపల, బయట అనేది అహంకారానికిఉందికాని ఈశ్వరుడికి లోపలలేదు, బయటలేదు. ఆయన అంతటా ఉన్నాడుకాని నీకు ఒక కేంద్రంచూపించటంకోసం లోపలున్నాడుఅని చెప్పాడు. ఏకాంతవాసం నీలోపలేఉంది. దేహబుద్ధి నశిస్తే ఏకాంతవాసం నీకు దొరుకుతుంది. మనం జిన్నూరులోఉంటే ఒకలాగ, అరుణాచలంలోఉంటే ఒకలాగ ఉంటే అది సరియైన స్థితికాదు. ఈ దేహం ఎక్కడున్నా మనం సమానంగా ఉండగలగాలి, హెచ్చుతగ్గులు ఉండకూడదు. భగవంతుడు మనకు ఇచ్చిన పనిని హృదయపూర్వకంగాచేస్తూఉంటే మనకు స్వేచ్ఛ కలుగుతుంది, శాంతి కలుగుతుంది. పనిద్వారా మనకు స్వేచ్ఛకలగాలి. ఇష్టం అయిష్టం, గౌరవం అగౌరవం ఈ ద్వందాలకు అతీతంకానివాడికి జ్ఞానంకలుగదు. మీరు విసర్జించే మలంలోఉన్న పురుగును నేనుఅని బాబాచెప్పారు. అంటే I am nothing అనిచెప్పటం. అలాగని మనం ఆయనను తక్కువగా చూస్తున్నామా? లేదు ఆయనకు గుడులుకట్టి ఆరాధిస్తున్నాము. మనలను ఎవరైనా చిన్నమాటఅంటే వారిమీదకోపం తెచ్చుకొంటాము, ఇంక జీవితంపాడుగునా విరోధాలే. రాగం, భయం, కోపం, లోభిత్వం ఇవిఅన్నీ నరకద్వారాలుఅని భగవంతుడుచెప్పాడు. ఒకసారి బాబా దగ్గరకు ఒకపరమలోభి వచ్చాడు వాడిజేబులో వెయ్యిరూపాయలు ఉన్నాయి. వాడికి ఏమీసాధనలేదు. వాడు బాబాగారిని నాకు మోక్షం అనుగ్రహించండిఅని అడుగుతున్నాడు.

అప్పుడు బాబాగారు అక్కడఉన్న భక్తుడిని పిలిచి నాకు 5 రూపాయలు కావాలి అనిఅంటూ ఊరిలోఉన్న ఒకభక్తుడి పేరుచెప్పి అక్కడకువెళ్ళి అడిగి తీసుకొనిరమ్మని చెపుతారు. ఆ భక్తుడు అక్కడకువెళ్ళి ఆయనలేడు అని తిరిగివచ్చి బాబాగారితో చెపుతాడు. బాబాగారు మరలఇంకోపేరుచెప్పి అతనిని అడిగి తీసుకొనిరా అని పంపుతారు. అతనుకూడా ఊరిలోలేడుఅని తిరిగివచ్చేస్తాడు. వారు ఊరిలోలేరుఅని బాబాగారికి తెలుసు కాని ఇక్కడఉన్న ఆ లోభికి తెలియజేయటంకోసం ఇదిఅంతా చేస్తున్నారు. నా దగ్గర డబ్బుఉంది తీసుకోండి అనివాడు బాబాగారితో చెప్పటంలేదు. అప్పుడు బాబాగారు వాడిని పిలిచి నీ జేబులో డబ్బుఉంది కాని మీకు అవసరంకదా 5 రూపాయాలు తీసుకోండి అని అనటంలేదు. 5 రూపాయలు ఇవ్వలేని నీకు మోక్షం కావాలా? 5 రూపాయలు త్యాగంచేయలేని నీవు దేహబుద్ధిని ఎలా త్యాగంచేయగలవు త్యాగికానివాడు జ్ఞానికాలేడు. నీవు నీవుగా ఉండటం జ్ఞానం. నీమనస్సు దేనిమీద వాలకుండా ఉండటం వైరాగ్యం. జ్ఞానంవేరు, వైరాగ్యంవేరు అనుకొంటాము కాని రెండూ సమానమే. నీవు నీవుగా ఉన్నప్పుడు నీ మనస్సు దేనిమీద వాలదు.

నేను అదిచేసాను, నేనుఇదిచేసాను అనేది కర్తృత్వబుద్ధి. ఇది అజ్ఞానంనుండివస్తుంది. మనం ఎవరిమో మనకు తెలియకపోవటమే అజ్ఞానం. కర్తృత్వబుద్ధివలన మనకు దుఃఖంవస్తుంది. కర్తృత్వబుద్ధి నశిస్తే దుఃఖంలేదు. మనకు మమకారం ఉంటుందికాని మాకు మమకారంలేదు అని అనుకొంటూఉంటాము. బాబావంటి మహాత్ములదగ్గర కూర్చొన్నప్పుడు మనలోఉన్న మమకారాన్ని మనకు తెలియజేస్తారు. మనకు మమకారంఉందిఅని తెలియటానికి కొన్ని సంఘటనలు క్రియేట్‌చేస్తారు. నీకు కర్తృత్వబుద్ధిఉంటే బయట సంఘటనల ప్రభావం నీమీద ఉంటుంది. నీకు కర్తృత్వబుద్ధి నశిస్తే లోకంలోజరిగే సంఘటనలు అవి మంచివిఅయినా, చెడ్డవిఅయినాకూడా వాటి ప్రభావం నీమీదఉండదు. దేహగతమైన యాత్ర ముగిసినప్పుడు ఎవడికి జ్ఞానంరాదు. దేహం మరణించిన తరువాత ఎవడైతే ప్రయాణంచేస్తున్నాడో వాడికి ముగింపు వచ్చినప్పుడు నీకు జ్ఞానంకలుగుతుంది. మిమ్మల్ని అగౌరవపరిస్తే మీకు దుఃఖంవస్తుంది. అగౌరవపరచినవాడు దేవుడుఅన్న సంగతి మీకు తెలియటంలేదు. లోపలఉండి ఆ సంఘటనలను ఎందుకుపెట్టాడుఅంటే మీ మనస్సును లోపలకు గెంటుకొని వెళ్ళటానికే ఇదిఅంతా చేస్తున్నాడు అని మీకు తెలియటంలేదు. మనం ఏ పనిచేసినా ఇష్టంతోగాని, అయిష్టంతోగాని చేస్తాము. ఇష్టం, అయిష్టం ప్రక్కనపెట్టి భగవంతుడు ఈ పనిచేయమన్నాడు కాబట్టి చేద్దాముఅనుకొనేవారు మనలోఎంతమంది ఉన్నారు. ఇష్టాలు, అయిష్టాలు ప్రక్కనపెట్టి పనిచేసేవాడు కర్మయోగి. కృష్ణుడు గోవర్ధనపర్వతం





ఎత్తాడు, అలాంటి గొప్పపనులు చేయాలనిఉందిఅని ఒకరు అడిగితే నేనుగొప్పపనిచేసానుఅని ఆయన అనుకోలేదు. గొప్పవాడు ఎప్పుడూ నేనుగొప్పవాడినిఅని అనుకోడు. ఇతరులకంటే నాలోఏదో ఆధిక్యతఉందిఅని వాడు అనుకోడు. కృష్ణుడు పనిచేస్తున్నట్లు నీకళ్ళకు కనిపిస్తోంది కాని ఆయన చేసినా చేయనివాడితో సమానము. ఎందుచేతనంటే అక్కడ కర్తలేడు. అక్కడ ఉన్నది దేహగతమైన నేనుకాదు ఆత్మగతమైన నేను

అహంకారం రూపంలేకుండా, నామంలేకుండా స్వతంత్రంగా ఉండలేదు. ఏదో రూపాన్ని, నామాన్ని పట్టుకొని ఉంటుంది. విషయచింతనవలననే అహంకారానికి Food అందుతూఉంటుంది. విషయచింతన ఎక్కడనుండివస్తోందిఅంటే రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి వస్తోంది. మనరూపంనుండి, నామంనుండి ఎప్పుడైతే విడుదలపొందామో అప్పుడు అహంకారం మనలను విడిచిపెట్టేస్తుంది. ఉన్నదల్లా ఒక్కటే. అదే బ్రహ్మం. అది నీవైఉన్నావు. అది గ్రహించటానికే ఈ సాధనలుఅన్నీ. లోకంలో నీవు ఎన్నో పనులుచేస్తున్నావు. కాని నిన్ను నీవు ఉద్ధరించుకోవాలనుకొన్నప్పుడు లోపలఉన్నవస్తువును తెలుసుకొని తీరవలసిందే. అదితప్ప మిగిలినదిఅంతా స్వప్నసమానము. ఒకటిగుర్తుపెట్టుకోండి. మీమనస్సును ఎప్పడూ విరోధం చేసుకోవద్దు, ఎప్పడూ స్నేహితుడిగాఉంచుకోండి. సుబ్బమ్మగారు శాంతిగాఉన్నారుఅనుకోండి. జువ్వలపాలెంలో అందరూ సుబ్బమ్మగారు అశాంతిగాఉన్నారుఅంటే ఆవిడకువచ్చే నష్టంలేదు. నిజంగా సుబ్బమ్మగారు అశాంతిలోఉన్నారుఅనుకోండి. సుబ్బమ్మగారు శాంతిగాఉన్నారు అని అందరూ అనుకొంటే ఆవిడకువచ్చే లాభంలేదు. అందువలన కపటంవద్దు. నిన్ను నీవు ఉద్ధరించుకో. నీ మనస్సును బాగుచేసుకోవటానికి కృషిచేసుకో. నీకృషే కృపక్రింద మారుతుంది. నీవు కానిదాని గొడవవదిలివెయ్యి. దేహంగొడవ, అహంకారంగొడవ లోనికి వెళ్ళవద్దు. నిరంతరం ఆత్మచింతనలోఉండు అప్పడు దేహవాసన, లోకవాసలోనుండి బయటకువచ్చేస్తావు. శాస్త్రము చదువుతున్నావుఅనుకో అందులో ఆత్మజ్ఞానానికి ఉపయోగపడే విషయంఉంటే పట్టుకో, దానిని మననంచేసుకో. జ్ఞానంసంపాదించు. మీకు ఏదైనా బలహీనతఉంటే దానితో పేచీపెట్టుకోవద్దు, బలహీనతను చింతించేకొలది అది పెరిగిపోతుంది. ఈశ్వరుని చింతిస్తూఉంటే అందులోనుండి Safe గా బయటకువచ్చేస్తావు. దానితో ఘర్షణపడవద్దు.

దేహమునేనుఅనే బుద్ధినుండి విడుదలపొందటానికి సాధన చేయమంటున్నారు. మాకు అన్నింటికంటే దేహంఅంటేనే ఎక్కువిష్టం మరిదేహంలేకుండా ఎలా ఉండగలముఅని అడుగుతున్నారు. గాఢనిద్రలో మీకుదేహం గొడవలేదు. మరిమీరు ఉన్నారా? లేదా? అంటే

మీరు ఉన్నారు, దేహంగొడవలేకుండా అక్కడ శాంతిగాఉన్నారు. ఆస్థితిని మీరు జాగ్రదావస్థలోనికి తెచ్చుకోండి. అదే మీకడసారిజన్మ. ఈదేహమునీవుకాదు, ఈ మనస్సువు నీవుకాదు, నీవుఆత్మవు దానికి పట్టుకలేదు, దానికి చావులేదు, అదే నీవుఅని చెపుతున్నారు. నేను ఆత్మనుఅయితే అదిగానే ఉండాలికదా ఈ దేహంగొడవ, మనస్సగొడవ ఎందుకువచ్చిందిఅని అడుగుతున్నారు. నీవుదేహం అనుకోకపోతే ఈ కర్మను ఎవరు అనుభవిస్తారు. నీకు ఆత్మభావన వచ్చిందిఅనుకో కర్మఅనుభవించేవాడు ఉండడు. నీవు పూర్వజన్మలో కర్మచేసి వచ్చావు. నీవు దేహంకాకపోయినా, దేహమే నేనుఅనేతలంపును నీకుఇచ్చి ఆ కర్మానుభవం తీసుకొనివస్తాడు. దేహముఅనే కట్రాడుకుకట్టేసి ఈశ్వరుడు దెబ్బలుకొడుతున్నాడు. ఆ కట్రాడునుండి విడుపించుకొన్నావుఅనుకో దేహాన్ని, లోకాన్ని, దేవుడిని దాటివెళ్ళిపోతావు. దేహాభిమానంనుండి బయటకువస్తే ఎంతకర్మఉన్నా అది కాలిబూడిదఅయిపోతుంది. నీవు దేహంగాఉంటే, మనస్సుగాఉంటే అన్నీ సమస్యలే. నీహృదయంలో ఒక నిజంఉంది. అదినీవై ఉన్నావు. అది ఎలాఉందో అలాఉండు నీకు సమస్యలు లేవు.

విగ్రహారాధనవలన మీమనస్సుకు నిగ్రహంకలుగుతూఉంటే అంతవరకు అది మంచిదేగాని అది పరమసత్యంకాదు. విగ్రహారాధనలు, యాత్రలు ఇవిఅన్నీ మహర్షి చూపుతో సరికావు. ఎందుచేతనంటే వారిని వారు చూసుకొని ఇతరులను చూస్తారు. కళ్ళుమూసుకొంటే వారిని వారు చూసుకొంటారు, కళ్ళుతెరిస్తే వారిలోఉన్నది మనకు చూపిస్తూఉంటారు. ఆ దేహంగొడవ మనకువద్దు. అది ఏ కులం, ఏమతం అనే గొడవ మనకువద్దు. ఎవరి సమక్షంలో ఉన్నప్పుడు శాంతితరంగాలు మనలను ముంచుతున్నాయో వాడేజ్ఞాని. మనం ఇతరులబాగుకోరతాముఅనుకోండి. వారు బాగుపడవచ్చు, బాగుపడకపోవచ్చు కాని ఇతరులు బాగుపడాలిఅనే తలంపువలన భగవంతుడు మనకు ఆధ్యాత్మిక అభివృద్ధిని ఇస్తాడు. అజ్ఞానంవలన, దేహాభిమానంవలన జీవితంలోఉన్న మాధుర్యం మనకు తెలియటంలేదు. మీ ఇంటిలోఅందరూ మీకు విరోధులుఅనుకోండి. అది మీకుమంచిదే ఎందుచేతనంటే దానివలన మీకు వైరాగ్యం కలుగుతుంది. ఇంటిలో అందరూ విరోధులుగాఉంటే అది భగవంతుని అనుగ్రహమేఅనుకోండి. వారు ప్రేమగాఉంటే వారిమీద మమకారం పెరుగుతుంది, అప్పుడు దేవుని స్మరించటం మానివేసి వారిని స్మరిస్తాము. అవతారపురుషులతోటి, గురువుతోటి మానసిక అనుబంధంవలన మీరు కానిదానిలోనుండి విడుదలపొందుతారు, పొందవలసినది పొందుతారు, మీకు స్వేచ్ఛకలుగుతుంది. ఎటువంటి





పరిస్థితులలోను అశాంతికి గురిఅవ్వద్దు. పరిస్థితులు అనుకూలంగాఉంటే గర్వంతెచ్చుకోవద్దు. ప్రతికూలంగాఉంటే నిరాశవద్దు. గురువుయొక్క మౌనంవలన మీ మనస్సు అణగటమేకాదు, మనస్సు ఆరోజుకారోజు పవిత్రం అవుతుంది, నిర్మలం అవుతుంది. ఎన్నో సంవత్సరాలు సాధనచేసినా మీకు తెలియని విషయం గురువుయొక్క సమక్షంలో నీహృదయంలోఉన్న వస్తువు ఒక్కసారి తళుక్కున మెరుస్తుంది. మీరు స్వప్రయత్నం వలన పొందలేనిది గురువు సమక్షంలో పొందుతారు. గురువుయొక్క సమక్షం అటువంటిది. గురువుయొక్క మౌనం సమర్ధవంతమైన భాష, అది మీ మనస్సులో మార్పు తీసుకొనివస్తుంది, మౌనం సమర్ధవంతమైన భాష, అది మీ మనస్సులో మార్పు తీసుకొనివస్తుంది, మౌనం పరిపూర్ణమైన ఉపదేశం. మౌన భాష అందరికి అర్ధంకాదు. అది గురువుకు తెలుస్తూఉంటుంది. అందువలన నోరుతెరచి మాట చెపుతాడు. ఆ మాటకూడా అనుగ్రహమే. మేము ఇలా ఏదో చెప్పకొంటూ వెళుతున్నాము. కాని మీరు ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే, ఆయనమీద పరిపూర్ణమైన విశ్వాసం కలిగిఉంటే ఆయన ఎక్కడఉన్నారో అక్కడకు మిమ్మలను తీసుకొనిపోయి ఆయనలో ఐక్యం చేసుకొంటాడు.

### ఓం నమో భగవతే శ్రీరమణాయ

### రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 18-11-01, రాయలం, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు పనికివచ్చే ఆత్మ తెలియటంలేదు, పనికిరాని దేహం, మనస్సు మనకు తెలుస్తున్నాయి. ఇవిరెండూ చొక్కాలు, ఇవి మనకు తొడుగులు. వీటిని జాగ్రత్తగా చూసుకొంటున్నాము. ఇవిరెండూ మనకు తెలుస్తున్నాయిగాని లోపల ఉన్న సద్వస్తువు మనకు తెలియటంలేదు. పూర్వం ఓర్పు ఎక్కువగాఉండేది. ఇప్పుడు ఓర్పు తగ్గిపోయింది. చిన్న సమస్యవచ్చినా తట్టుకోలేకపోతున్నారు. సహనం తగ్గిపోవటంవలన మానసిక సమస్యలు ఎక్కువ వస్తున్నాయి. ఆస్తిఅంటే మీకు బ్యాంక్‌లో ఉన్నడబ్బు, మీకుఉన్న పొలం, ఒక్కటే ఆస్తి అనుకోవద్దు. మీఇంట్లో బుద్ధిమంతులు, మంచితనంఉన్నవారుంటే వారు మీ ఇంటికి ఆస్తి, గ్రామంలో పదిమందికి ఉపయోగపడే పనులు చేసేవారు ఉంటే, సహృదయంగలవారు ఉంటే వారు గ్రామానికి ఆస్తి. వాస్తవం చెప్పాలంటే మనకు సహృదయం ఉన్నవారితో సహవాసం దొరికితే, సహృదయంఉన్నవారితో సహవాసం ముందు వైకుంఠముకూడా సరిపోదు,

కైలాసంకూడా సరిపోదు. అయితే మనకు సహృదయంఉన్నవారు దొరకాలికదా. పూర్వపుణ్యంవలన సత్పురుషులతో సహవాసం దొరికితే అందులో భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి వస్తుంది, అన్నీవస్తాయి, మనోవికాశం కలుగుతుంది, చైతన్యస్థాయి పెరుగుతుంది. అందువలన సత్పురుషులతో సహవాసం వైకుంఠంకంటే, కైలాసంకంటే ఉత్తమమైనది, ఉన్నతోన్నతమైనది. కొంతమంది వారిగురించి వారు ఆలోచించుకోరు, ఏమితింటున్నాము, ఏమిబట్టకట్టుకొంటున్నాము ఇతరులగురించే ఆలోచిస్తూ ఉంటారు. అటువంటివారితో సహవాసం దొరికితే దానికి మించిన వైకుంఠంలేదు.

వేము శరణాగతి చేసాము అనుకొంటున్నాము. ఈశ్వరుడు మాకు సహాయంచేస్తున్నట్లు మాకు అనిపించటంలేదుఅని అడుగుతున్నాడు. నిజమైన శరణాగతి చేసినవాడు సహాయం దొరకటంలేదుఅని అనుకోడు. అలా అనుకొంటే అది నిజమైన శరణాగతికాదు. నోటితోకాదు శరణాగతి చేయవలసింది. దేవుడి పటం దగ్గర మనం పండు ఎలాపెడుతున్నామో అలాగ మన మనస్సును దేవుడి పాదాలదగ్గర పెట్టాలి. అది శరణాగతి అంటే భగవంతుడు మనకంటే తెలివైనవాడు. మనకు ఏదిమంచిదో మనకంటే ఆయనకే ఎక్కువతెలుసు. ఈ విషయం బాగా అర్ధమయినవాడు నిజమైన శరణాగతి పొందుతాడు. సూర్యుడు మనకు బయట వెలుగును ఇస్తున్నాడు. శరణాగతివలన లోపల వెలుగువస్తుంది. బయట వెలుగువలన మనకు వస్తువులు ఎలా కనిపిస్తున్నాయో అలాగే లోపలవెలుగువలన మన హృదయంలోఉన్న సద్వస్తువు మనకు గోచరిస్తుంది. మనం ఏదైతే నేనునేను అంటున్నామో ఆ నేనును తీసి ఒకప్రక్కనపెడితే లోపలఉన్నవస్తువు ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. శరీరానికి మరణంరాకముందే ఈ నేనును తీసి ఒకప్రక్కనపెడితే వాడు యోగిగా చనిపోతాడు, ఆ నేనును తీసి ఒకప్రక్కనపెట్టకపోతే వాడు రోగిగా చనిపోతాడు. యోగిగా మరణించినవాడికి మరణభయం ఉండదు ఎందుచేతనంటే మరణంతరువాతకూడా తాను ఉంటానని వాడికి తెలుసుకాబట్టి మరణంఅంటే వాడికి భయంఉండదు. రోగికి మరణభయం ఉంటుంది. యోగిగా చనిపోయేవారు చాలా తక్కువమంది ఉంటారు, రోగిగా చనిపోయేవారు ఎక్కువమంది ఉంటారు. ఈశ్వరుడి దగ్గరనుండి సహాయ సహాకారములు అందటంలేదు అని ఎవడు అంటున్నాడు? దొంగనేనుఅంటోంది. ఎవడైతే సహాయసహకారములు అందటంలేదుఅని అంటున్నాడో వాడిని తీసి ఒకప్రక్కనపెట్టు అంటున్నారు భగవాన్. వాడిని తీసేస్తే మోక్షం, తీయకపోతే బంధం. మనస్సు రకరకాలుగ ఉంటుంది. ఒకరితో ఇష్టంగా ఉంటుంది, ఒకరితో విరోధంగా ఉంటుంది, ఒకరికి





పెట్టమంటుంది, ఒకరిని మొట్టమంటుంది ఇలా రకరకాలుగా తింగర తింగరగా ఉంటుంది. అజ్ఞాని వంద నాలుకలతో మాట్లాడతాడు, రకరకాలుగా మాట్లాడతాడు. కాని జ్ఞానికి ఒకే నాలుక ఉంటుంది దానితో మాట్లాడతాడు. మనకు పూర్వపుణ్యం లేకపోతే అజ్ఞానులతో స్నేహాలు దొరుకుతాయి. ఎక్కడ సత్పురుషులుఉంటే అక్కడే కాశీ. కాశీ అంటే ప్రకాశం. సత్ఫురుషులతో సహవాసంచేస్తూ ఉంటే మనకు ప్రకాశం వస్తుంది. అదే కాశీ. పూర్వపుణ్యంలేకపోతే సత్పురుషులతో సహవాసం చేయాలనే సంకల్పంకూడా నీకురాదు. ఈశ్వరుడికి శరణాగతిచెందాను, ఆయన సహాయంచేయటంలేదు అంటున్నావు. వారుచేస్తారు, లేకపోతే చేయరు ఆగోలనీకుఏల? నీవుచేసే పని ధర్మంగాచెయ్యి, ప్రేమగాచెయ్యి. ధర్మాన్ని మనం ఆచరిస్తూఉంటే, ధర్మంపట్ల మనం గౌరవం కలిగిఉంటే సరస్వతీ వస్తుంది, లక్ష్మీ వస్తుంది. నీచేతిలోఉన్న పనిని ధర్మంగాచెయ్యి. ఆయన చేసేది ఎప్పడు చేయాలి, ఎలాచేయాలి అనేది ఆ మూహూర్తం ఆయన పెట్టుకొంటాడు. నీవు ఏమి చేస్తున్నావుఅంటే నీవు చేసేపని చేయటంలేదు, ఆయనచేసేది ఎలాచెయ్యాలో చెపుతున్నావు. నీపట్ల దేవుడు ఎలా ప్రవర్తించాలో నీవు ఆయనకు చెపుతూఉంటే అది శరణాగతా? మీఇంట్లో పనిమనిషికి పని ఎలాచేయాలో చెప్పినట్లు దేవుడికి ఇలాచెయ్యి అని చెపుతూఉంటే ఆయన పనిమనిషా? అది శరణాగతా? అది శరణాగతికాదు. నీవు శరణాగతి అనుకొంటున్నావు కాని నీహృదయంలో ఆభావనేలేదు. మనం ఎంతోకొంత కష్టపడకుండా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాలేము. మనబుద్ధిలో మార్పురావాలి, మనకు మంచిమంచి తలంపులురావాలి. చేసేపని ప్రేమగాచేయాలి.

**కర్మకు ఫలం ఉన్నది. ఒకటి కారణం,**
**రెండవది కార్యం. రెండిటికీ గల సంబంధం**
**ఒకానొక శక్తి ఫలితం. దానినే దైవమని పిలుస్తాము.**
**దైవం కర్మఫల ప్రదాత.**

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**

ఎవరోవచ్చి ఏదో సహాయంచేస్తారుఅని ఎదురుచూడకుండా మనకాళ్ళమీద మనం నిలబడగలగాలి. మనం ఒంటరిగానే ఈ భూమిమీదకు వచ్చాము. పుణ్యం, పాపంకూడా ఒంటరిగానే అనుభవిస్తాము. చనిపోయినతరువాతకూడా ఒంటరిగానే ప్రయాణంచేయాలి. ఇవాళ స్నేహితులు, బంధువులు చాలామందిఉన్నారు అనుకోవద్దు చనిపోయినప్పుడు ఎవరూ నీకూడారారు, నీవుఒక్కడివే ప్రయాణంచేయాలి. అందుచేత రోజూ కొద్దిసేపు ఏకాంతంగాఉండి సాధనచేసుకోండి. ఏకాంతంగా కూర్చొన్నప్పుడు మీ మనస్సులో ఏమిఉందో మీకు తెలుస్తుంది. హృదయంలోఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి ఏ విషయాలు అడ్డువస్తున్నాయో నీకు ఏకాంతంగా ఉన్నప్పుడు తెలుస్తుంది. తెలిసినతరువాత దేవుని ప్రార్థించి ఒకోదానిని తొలగించుకోవాలి. అదే సాధన నీరు అంతటా దొరుకుతూఉంటే నీకు నూతితోటి, చెరువుతోటి, కాలువతోటి పనిఏల అంటాడు కృష్ణుడు గీతలో. అలాగే నీకు హృదయంలోఉన్న ఆనందం దొరికినప్పుడు బాహ్యంగావచ్చే అనుభవాలు నిన్ను ఏమీచేయలేవు, వాటిని మీరు పట్టించుకోరు. మీకు ఏదైనా దుఃఖంఉందిఅనుకోండి. దేహం మరణించినప్పుడు దుఃఖం ఆగిపోదు, దుఃఖంమీకూడా వచ్చేస్తుంది. దేహముతో తాదాప్యంపొందే నేను నశించినప్పుడు ఆత్మానందం మీచేతికి అందుతుంది. పుణ్యంకూడా పాపంతో సమానము అనిచెప్పారు. ఈ మాటలకు కంగారుపడవద్దు. పుణ్యంచేసుకోవద్దుఅని కాదు. పాపంచేసినవాడికి చెడ్డజన్మలురావచ్చు. ఇది నేను చేస్తున్నానుఅనే భావనతో పుణ్యంచేస్తే మంచిజన్మ వస్తుంది. శరీరంవచ్చినతరువాత ఎలాగైనా తంటాయే. నేను చేస్తున్నానుఅనే భావనలేకుండా పుణ్యంచేస్తే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధిద్వారా మోక్షంవస్తుంది. నీవుఏదైనా మంచిపనులు చేసినా ఇది నేను చేస్తున్నాను అనే భావనతోచేస్తే అది పునర్జన్మకు కారణం అవుతుంది. మంచిజన్మరావచ్చు, మంచిలోకాలురావచ్చు. మరల తిరిగి ఈభూమిమీదకు రావలసిందే. కర్మను యోగంగచేస్తే నీవు నిజమైన సన్యాసివి అవుతావు. కర్మఫలాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పనిచేసేవాడిని కర్మయోగి అంటారు. వాడి మనస్సు విశాలమవుతుంది, హృదయంలోఉన్న సద్వస్తువు వాడికి వ్యక్తమవుతుంది.

నువ్వుఉన్నావుఅనుకొంటున్నావు, నేనులేనుఅనుకొంటున్నావు. నువ్వు నాలోనుండే వచ్చావు అన్న సంగతి మర్చిపోయావు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. మీరు ఎక్కడనుండి వచ్చారో మర్చిపోయారు. మీరు ఎక్కడనుండి వచ్చారో అది జ్ఞాపకం ఉంచుకోండి మీరు ఉన్నారు అనుకొంటున్నారు, లోకంఉంది అనుకొంటున్నారు. నేనులేనుఅనుకొంటున్నారు. కాని మీరు ఇద్దరు నాలోనుండే వచ్చారు అని మర్చిపోయారు. నీ శరణాగతి నిజమైతే నీవు





భగవంతుని సంకల్పానికి బద్ధుడవై ఉండాలి. మీకు భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం ముందుఉండాలి. ఆయన ఏది చేసినా మనమంచి కోసమే చేస్తున్నాడు అని విశ్వాసం ఉండాలి. ఇవిరెండూఉంటే మీకు జ్ఞానంవచ్చేస్తుంది. ఈశ్వరునిమీద ప్రేమలేకుండా, సజీవమైన విశ్వాసంలేకుండా ఏదోసాధనలు చేయటంవలన మోక్షంవస్తుందిఅని అనుకోవద్దు. కొంతమంది రోజూ భగవంతునికి పూజచేస్తారు కాని ఆయన చెప్పినమాట వినరు. అది భగవంతుడు చూస్తూనే ఉంటాడు ఆయన అంతర్యామి. మనం భగవంతుని ఏమంటున్నాముఅంటే I am everything, You are nothing అంటున్నాము. అంతానేనే నీవుఏదీకాదు అంటున్నావు దేవుడిని. అది తిరగేసుకొంటే మనకు జ్ఞానంవస్తుంది అంటే


# రమణ భాస్కర

**ఫారం 4 (రూలు 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలము | : | **పాలకొల్లు** |
| 2. | ప్రచురణ కాలము | : | **పక్ష పత్రిక** |
| 3. | ప్రచురణ కర్తపేరు | : | **పి.ఎస్. రామరాజు** |
| 4. | భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| 5. | చిరునామా | : | **లక్ష్మీ మోడరన్ రైస్ మిల్లు** |
| | | | **ఉల్లంపర్రు - పాలకొల్లు** |
| 6. | పబ్లిషర్ భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| | చిరునామా | : | **పాలకొల్లు** |
| 7. | సంపాదకుడు భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| 8. | పత్రిక యజమాన్యం | : | **పి.ఎస్. రామరాజు** |
| | | | **పబ్లిషర్ & ఎడిటర్** |

You are everything, I am nothing అంటే జ్ఞానం వస్తుంది. నేను సున్నా, దేవుడు ఉన్నాడు అనుకొంటే జ్ఞానంవస్తుంది. సైన్సు పెరిగిందిగాని మానవస్వభావంలో మార్పులేదు. పూర్వం ఎలా ఉన్నారో ఇప్పుడుకూడా అలాగే ఉన్నారు. మనలో అసూయలేనివారు, స్వార్థంలేనివారు ఎంతమంది ఉన్నారు? మీరు ఎంతకాలం ఒకవ్యక్తితో స్నేహంచేసినా ఒక్కరోజు వాడి స్వార్థానికి అడ్డువస్తే వెంటనే వాడు మీకు విరోధి అవుతాడు. మీకు భగవంతుడిమీద విశ్వాసంఉంది అని మీరు అనుకొంటే సరిపోదు, అది ఆయన అనుకోవాలి. నీకు ఇష్టంలేనివి జరిగితే బాధపడకూడదు. అన్నీ నీకు ఇష్టమైనవే జరుగుతాయా? ఇష్టంలేనివి ఎందుకు జరుగుతున్నాయో ఈశ్వరుడికి తెలుసు. నీ జీవితాన్ని మలుపు త్రిప్పటానికి అవి చేసాడేమో. ఒకోసారి భక్తులుకానివారికంటే భక్తులకు ఎక్కువ కష్టాలువస్తూఉంటాయి. ఇన్ని కష్టాలువస్తున్నాయి ఏమిటి అనుకోవద్దు. వాటిని ఒక్కజన్మలోనే తీసేసి నిర్వాణస్థితి ఇవ్వటానికి భగవంతుడు అలాచేస్తున్నాడు. నీకు ఇప్పుడు కష్టంరావచ్చు. నీవు కంగారుపడవద్దు. అది పరిణామంలో సుఖంగా, శాంతిగా మారిపోవచ్చు. రోగంవలన ఇష్టంవస్తుంది, ద్వేషంవలన అయిష్టంవస్తుంది. వీటిని తీసి ఒకప్రక్కనపెట్టి నీవు పనిచెయ్యి. ఇష్టాలను, అయిష్టాలనుబట్టి పనిచేస్తే నీకు జ్ఞానం ఎలావస్తుంది. వీటిని దాటి నీవు పనిచేయాలి. అప్పుడు నీవు భక్తుడవు అవుతావు. చెరువులో మునిగినవాడికి లోతు తెలుస్తుంది. కాని పైపైన ఈతలు కొట్టేవాడికి లోతులు ఏమి తెలుస్తుంది. ఒక వాసన మీలో ఉన్నప్పుడు ఆ వాసన లోనుండి విడుదల పొందటానికి నీవు ప్రయత్నం చేసినప్పుడు ఆ వాసనాబలం మనకి తెలుస్తుంది. అప్పటివరకు ఆ వాసన బలం ఎంతో మనకు తెలియదు. కోరికవలన, కోపంవలన మోహం వస్తుంది. ఎప్పుడైతే నీవు మోహంలో పడ్డావో అప్పుడు నీబుద్ధి నెమ్మదిగా పాడైపోతుంది. శరీరంపాడైపోతే ప్రమాదంలేదుగాని బుద్ధిపాడైపోతే చాలాప్రమాదం. శరీరం ఎంత పాడైపోయినా స్మశానంతో దాని యాత్ర ఆగిపోతుంది. కాని బుద్ధి పాడైపోతే చాలాప్రమాదం ఈ పాడుబుద్ధి రాబోయే జన్మకు వస్తుంది. నీవు తినే తిండికి, కట్టుకొనే బట్టకు ఇచ్చే ప్రాముఖ్యత మరణానంతరం నీకూడా వచ్చే బుద్ధికి ప్రాముఖ్యత ఇవ్వవా?

సంసారంలో చాలా బాధలు వస్తున్నాయి అంటారు. కంగారు పడకండి. ఆ బాధలు ఏ మంచికోసం వస్తున్నాయో? భగవంతుడికి తెలియకుండా ఈ బాధలు మీకు వస్తున్నాయా. ఏ ట్రైనింగ్ ఇవ్వటంకోసం ఆ బాధలు పంపించాడో? రాబోయే పదిజన్మలలో రావలసిన బాధలు ఈ జన్మలో పిండేస్తున్నాడేమో? మీకు జ్ఞానోదయం కలగటంకోసం ఇవిఅన్నీ భగవంతుడు చేస్తున్నాడేమో? ఎందుకు కంగారుపడతారు. భగవంతుడికి తెలియకుండా





మీకు ఈ సమస్యలు రావటంలేదు. మీకు దుఃఖంవస్తే కంగారుపడకు, దుఃఖం నిన్ను భగవంతునివైపుకు త్రిప్పవచ్చు. సంతోషం, దుఃఖం ఇవి నిజంకాదు. ఇవి స్వప్నసమానము. నీ దేహం ఎంతనిజమో అవికూడా అంతేనిజం. మేము ప్రాపంచిక మనుషులము. మేము దేవుడికి దూరంగాఉన్నాము, లోకానికి దగ్గరగాఉన్నాము మాకు స్నేహితులు, విరోధులు ఉన్నారు. ఇంట్లో సమస్యలు వస్తున్నాయిఅనుకోండి, సమాజపరంగా సమస్యలు వస్తున్నాయి అనుకోండి ఇదిఅంతా ఈశ్వరసంకల్పంఅని ఊరక ఉండలేకపోతున్నాము, మాబాధ మీకు చెప్పకొంటున్నాము. మా అహంభావన మాకు ఇష్టంగాఉంది. దానిని విడిచిపెట్టలేక పోతున్నాము. ఇష్టంగా ఉన్నదానిని విడిచిపెట్టలేకపోతున్నాము. వ్యక్తిభావన మాకు పోలేదు. నేను మంచివాడినిఅని, ఫలానాదేహంనాదిఅని, ఊరునాదిఅని అలా అనుకోకుండా ఉండలేకపోతున్నాము. ఇదిఅంతా అజ్ఞానమే అనుకోండి. కాని అలాఅనుకోకుండా ఉండలేకపోతున్నాము. మీరు చెప్పేది చెప్పకొంటూపోతున్నారు. కాని మేము అలా ఉండలేకపోతున్నాము. మనకు జ్ఞానోదయంఅయితే కులాలు, మతాలు గొడవ ఉండదు. మనకు కావలసింది హిందూమతం, క్రైస్తవమతంకాదు. మనం అభివృద్ధి చేసుకోవలసింది జ్ఞానమతం. మామూలు మతాలకు హద్దులు ఉన్నాయి. జ్ఞానమతానికి హధ్దులులేవు ఇప్పుడు నీవు చెప్పిన విషయాలుఅన్నీ విన్నాను. ఇదిఅంతా విన్నతరువాత నీవు శరణాగతి చెందలేదుఅని తెలుస్తోంది. శరణాగతి చేసినవాడికి ఇన్ని ప్రశ్నలురావు. ఈమధ్య మన భక్తులతోకూడా నాకు కొన్ని ప్రమాదాలు వస్తున్నాయి. ఎలాగంటే ఏదో ఒక ఎకరం పొలంఉందిఅనుకోండి. వారికి ఆ పొలం అమ్మేయాలిఅని ఉంటే నాన్నగారు అమ్మేయమన్నారుఅని చెప్పటం అంటే వారి అభిప్రాయాలను నామీదపెట్టి చెప్పటం. భక్తిఇలా ఉంది. వారి సొంత అభిప్రాయాలను చెప్పలేక నాన్నగారిమీద పెట్టి చెప్పేయటం మన భక్తులలో ఇలా చాలామంది ఉన్నారు. ప్రస్తుతం మేము మోసే బరువు ఇది. శరణాగతి చేసేముందు నీకు భగవంతుడిమీద నమ్మకంఉండాలి. భగవంతుడిమీద నమ్మకంలేకపోతే నీవు శరణాగతి చెందలేవు. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడుఅని పరిపూర్ణమైన విశ్వాసం నీకుఉంటే దొంగనేనుపోతుంది అప్పుడు నీకు శరణాగతి కుదురుతుంది. భగవంతుడిని తెలుసుకోవటానికి అనేక మార్గాలు చెపుతున్నారు కాని భగవంతుడిని తెలుసుకోవటానికి భగవంతుడే మార్గము అన్నాడు రామానుజుడు. భగవంతుడి అనుగ్రహంలేకుండా భగవంతుడిని తెలుసుకోలేవు. భగవంతుడేగతి, భగవంతుడేపతి, ఆయనను తెలుసుకోవటానికి ఉపాయంకూడా ఆయనే. అదే శరణాగతి. శరణాగతే నిన్ను గతి దగ్గరకు తీసుకొనివెళుతుంది. ఇదికాకుండా వేరేమార్గాలు ఉన్నాయిఅంటే అవి నిన్ను

మధ్యలో ముంచేస్తాయి. శరణాగతిలో కాకుండా వేరేమార్గాలలో కొంత ప్రయాణంచేసినా మధ్యలో మేము పెద్దవాళ్లము అయిపోయామని మీకు వికారాలు వస్తాయి, అక్కడనుండి పతనం ప్రారంభమవుతుంది అని చెప్పారు భగవంతుడు దర్శనంఇస్తే పొంగిపోకు, దర్శనం ఇవ్వకపోతే కృంగిపోకు. భగవంతుడు దర్శనం ఇచ్చినా, ఇవ్వకపోయినా నిర్మలంగాఉండు, అణిగిఉండు. నీవు అణిగిఉండకపోతే నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది.

మనకు అనుభవాలు ద్వైతపరంగా వస్తున్నాయి. ఎవరైనా నిన్ను తిడితే దుఃఖం వస్తోంది, పొగిడితే సంతోషంవస్తుంది. ఈ అనుభవాలు ద్వైతపరమైనవి, ఇంకోవ్యక్తిమీద ఆధారపడిన విషయాలు అవి. కాని లోపలఉన్న అనుభవం ఇంకోవ్యక్తిమీద ఆధారపడి ఉండదు అందుచేత అది పెర్మనెంట్‌గా ఉంటుంది. ఇంకోమనిషిమీద ఆధారపడి వచ్చినది ఏదీ నిలబడదు ఇతరవ్యక్తులమీదగాని, సంఘటనలమీదగాని ఆధారపడకుండా స్వతంత్రంగా లోపలనుండి వచ్చేది అద్వైతానుభవంగాని బయటనుండి వచ్చేది అంతా ద్వైతానుభవమే. మనం స్వతంత్రులంకాదు, మన అహంకారానికి మనం పాలేరుతనం చేస్తున్నాము. అహంకారంనుండి విడుదల పొందేవరకు స్వేచ్ఛలేదు, ఆనందంలేదు. అహంకారము తింగరిది. అది బయటకు పోతూఉంటుంది. దానికూడా నీవువెళ్లకు. నీవు ఆత్మభావనలోఉండు. అది అటుఇటు తిరిగివస్తుంది. దానికూడా నీవు వెళ్లకపోతే అది పడి ఉంటుంది, కొంతకాలానికి అది నశిస్తుంది. పెద్ద కష్టపడి దానిని లొంగదీసుకోవాలని అని అనుకోవద్దు. నీవు దానికూడా వెళ్లకపోతే బ్రహ్మ భావనలో ఉంటే కొంతకాలం గంతులువేసి చివరకు చనిపోతుంది. అహంకారంతో పేచీపెట్టుకోవద్దు. పేచీ పెట్టుకుంటే మీరు ఓడిపోతారు. దాని గొడవలేకుండా ఉంటే అది అణిగిపోతుంది. ఇక్కడ ఇంతమంది భక్తులు ఉన్నాము. మనం అహంకారంచేతిలో ఓడిపోయినవాళ్లమే. అందుచేత మనకు జ్ఞానం రావటంలేదు. నీకు ఏమిచేయాలో, ఎప్పుడుచేయాలో భగవంతుడికి తెలుసు, ఆయన చేస్తాడు. కంగారుపడవద్దు. నీవు అడగకపోతే చేయడేమో అని అనుకోవద్దు. ఆయన అంతర్యామి. అంతట ఉన్నాడు, నీకూడా ఉన్నాడు, మరణానంతరం నీకూడా జతగావచ్చేది నారాయణుడు ఒక్కడే. మరణానంతరం మనకూడా ఎవడైతే వస్తాడో వాడిని పూర్తిగా మర్చిపోతున్నాము, ఇది దురదృష్టకరం, బహుశా మనకు పుణ్యబలం లేకపోవచ్చు.

మనస్సు అనేది ఒకచొక్క. దానిని చిరగకుండా చూసుకొంటున్నాము. అందువలన లోపల ఉన్నవస్తువు నీకు గోచరించటంలేదు. భక్తిపేరు చెప్పి మనస్సును అలంకరించు కొంటున్నావు. చొక్కా చిరగటానికి సిద్ధంగాఉన్నా దానిని చిరగనివ్వటంలేదు ఎందుచేతనంటే అదే నువ్వు అనుకొంటున్నావు. భగవంతుడు అలాచేయాలి, ఇలాచేయాలి, ఆయన ఇలా ఉంటే బాగుండును అని అనుకోవద్దు. నీవు అనుకొన్నట్లు వారు ఉండరు. వారు ఎలా ఉన్నారో అలాగే ఉంటారు. బయటకూడా వారు అలా ఉంటే బాగుండును అని అనుకోకూడదు ఇటువంటి పిచ్చిగొడవలువద్దు. ఎవరి స్వభావాన్నిబట్టి వారు ప్రవర్తిస్తారు. భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే ఇంట్లో గొడవలు ఉంటే మీరు అవసరమైతే రాజీపడండి, ఏదైనా పదవి కావాలంటే రాజీపడండికాని అహంకారం తొలగించుకొనే విషయంలో ఎవరూ రాజీపడవద్దు అని చెపుతున్నారు. మీరు దేనికి కంగారుపడవద్దు. ఏది ఎప్పుడు ఎలా జరగాలో అలా జరుగుతుంది. ఆ టైమువచ్చినప్పుడు అది జరుగుతుంది ఈలోపుగా కంగారువద్దు. ఇదిఅంతా ఈశ్వరుడు చూసుకొంటాడు. అంతా ఆయనకే విడిచిపెట్టు. సృష్టిభారంఅంతా మోసేవాడు నీభారం మోయలేడా? మోయలేడేమోఅని నీ అహంకారానికి అనిపిస్తుంది. భారమంతా ఆయనమీదపెడితే నీకు ఏబాధాలేదు, ఏవికారంలేదు. నీకు అసలు టెంక్షన్‌రాదు. నీభారంఅంతా భగవంతుడుమీదపెట్టి నీపనిఏదో నీవుచేసుకో. నీవు చింతేమీ పెట్టుకోవద్దు. నీవు నిర్మలంగాఉండు, శాంతిగాఉండు. మేము పెద్దవాళ్లము అయిపోయాము అనుకోవద్దు. దేవుడు చెప్పినట్లు వినండి.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 09-12-01 | ఆది | పెన్మెత్స సత్యనారాయణరాజు, సూర్య పద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండప భవనం, పాలకొల్లు (కార్తీక వన మహోత్సవం) |
| 14-12-01 | శుక్ర | జ్ఞానానంద వృద్ధాశ్రమం, గొరగనమూడి |
| 19-12-01 | బుధ | తాడినాడ (వయా ఆకివీడు) |
| 25-12-01 | మంగళ | సాయిబాబా గుడి, కొవ్వాడ (కాకినాడ వద్ద) |
| 26-12-01 | బుధ | గీతా భవనం, కాపవరం |
| 27-12-01 | గురు | గీతా భవనం, కేశవరం |
| 31-12-01 | సోమ | శ్రీ రమణ జయంతి మహోత్సవం, శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |



### అరుణాచల దీపోత్సవం

ది. 30-11-2001 కార్తీక పౌర్ణమి సాయంత్రం గం॥ 6-00 లకు కృత్తికా నక్షత్రమందు పరమేశ్వరుడు అరుణాచలంలో జ్యోతిరూపంగా అవతరించిన గుర్తుగా జరిగే అఖండ మహోత్సవమునకు సుమారు 20 లక్షల భక్తులు గిరి ప్రదక్షిణ చేసినారు.

మొదటిసారిగా ఈ మహోత్సవమును అరుణాచలంలో జరుపుటకు ఆంధ్రప్రదేశ్ నుండి విచ్చేసిన సద్గురు శ్రీ నాన్నగారు మరియు వేలాది భక్తులు ఇక్కడకు వచ్చినారు. వీరందరిని శ్రీ నాన్న ఆశ్రమం, ఆంధ్రాశ్రమం, శివసన్నిధి, పంచముఖి ఆశ్రమాలు ఆశ్రయమిచ్చి ఆదరించారు.

సద్గురు శ్రీ నాన్నగారు సాయంత్రం గం॥ 4-00 లకు శ్రీ నాన్న ఆశ్రమంలో ఉన్న వేలాది భక్తులకు అరుణాచల స్థల పురాణం గురించి జ్యోతియొక్క ప్రాముఖ్యత గూర్చి విశదంగా వివరించారు. తదనంతరం అరుణగిరి మీద జ్యోతిని గం॥ 6-00 లకు వెలిగించిన వెంటనే

తరువాయి ..... అట్ట 3వ పేజీలో

శ్రీ నాన్న ఆశ్రమ ప్రాంగణంలో జ్యోతిని సద్గురు శ్రీ నాన్నగారు అమృతహస్తాలతో ప్రజ్వలింప చేసినారు. తరువాత భక్తులు అక్షరమణమాల పారాయణ చేసినారు.

ఈ కార్యక్రమమునకు శ్రీ రమణ క్షేత్రం ప్రెసిడెంట్ శ్రీ పి.ఎస్.ఎన్. రాజు(వైజాగ్), సెక్రటరీ శ్రీ శ్రీరామరాజు(జిన్నూరు) తదితర ప్రముఖులు హాజరు అయ్యారు.

శ్రీ సద్గురు సన్నిధి చేరాము చేరాము;
సద్గురు పాదము విడువము విడువము;
సూర్యుని పుత్రుని చూశాము చూశాము;
జ్యోతి స్వరూపము మరువము మరువము;
తండ్రి సన్నిధే మాకు తల్లి సన్నిధికూడ.
భూపతిరాజులై భక్తరాజ్యము నేల మాకేల భయము? అభయము వారే.

ది. 28-11-01 శ్రీ K.V.K. రాజుగారి జయంతి సందర్భంగా ప్రాతళ్లమెరక, కె.వి.కె. రాజు విద్యానికేతన్ ప్రాంగణంలో జరిగిన ఆధ్యాత్మిక సభకు శ్రీ D. రామకృష్ణ I.A.S., గారు అధ్యక్షత వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన సద్గురు శ్రీ నాన్నగారు తమ దివ్య సందేశమును అందజేశారు. ఉదయం శ్రీ కె.వి.కె. రాజు విద్యానికేతన్ అడ్మినిస్ట్రేషన్ భవన సముదాయమునకు సద్గురు శ్రీ నాన్నగారు శంఖుస్థాపన చేసారు.

### రమణ భాస్కర పాఠకులకు మనవి

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను ది. 23-9-2001 (సద్గురు శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం) నుండి సంవత్సర చందా రూ॥ 150/- లుగా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది. 23-9-2002 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా :

**శ్రీ పి. శ్రీరామరాజు** ("రమణ భాస్కర" కొరకు)
శ్రీ రమణ క్షేత్రం, **జిన్నూరు - 534 265,** ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్

**గమనిక : రమణ భాస్కర సం॥ర చందా ఇంతవరకు పంపనివారు దయచేసి వెంటనే పంపగలరు.**